## ‘కరవు, వలసలు, నీటిఎద్దడి, పంటలకు ధరలు, పెండింగ్ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం’

## రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర పిలుపు మేరకు జిల్లా కేంద్రాలలో ధర్నా



అనంతపురం శ్రీకాకుళం ఒంగోలు గుంటూరు

*రాష్ట్రంలో రైతుల, రైతుకూలీల, గ్రామీణ పేదల సమస్యలు తీవ్రమయ్యాయి. పండించిన పంటకు న్యాయమైన ధరలేక రైతులు, కౌలురైతులు తీవ్ర ఆందోళనలో వున్నారు. వేసవికాలం.... ఎండతీవ్రత అధికమౌతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోనూ ప్రత్యేకించి, అనంతపురం జిల్లా మొత్తంగాను; ఏజన్సీ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేసి తాగునీరు, సాగునీరు అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు విస్మరించాయి. పంటలు గిట్టుబాటుగాక, రుణభారంలో కూరుకుపోయి రైతుల ఆత్మహత్యలు రోజువారీ వార్తలయ్యాయి. వ్యవసాయకూలీల బాధలు వర్ణనాతీతంగా వున్నాయి. వ్యవసాయం కుదేలవటంతో, గ్రామాలలో కనీస పనులు లభించక, రోజుగడవక, పొట్టచేతబట్టుకొని ప్రవాహంలా గ్రామీణ పేదలు వలసలు పోతున్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించటంకోసమని ప్రకటించిన గ్రామీణ ఉపాధి హామీపథకం ఏమాత్రం వారికి ఉపశమనాన్ని కల్గించలేకపోతోంది.*

*ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాపితంగా జిల్లాల స్థాయిలో కలెక్టర్ కార్యాలయాలవద్ద ధర్నా చేపట్టాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. ఈ పిలుపుమేరకు–అనేక జిల్లాలలో పంటల ధరలు, వలసలు, పెడింగ్ ప్రాజెక్టులు, తాగునీటి ఎద్దడి తదితర సమస్యలను పరిశీలించి, ఆయా జిల్లా కార్యవర్గాలు కరపత్రాలు ముద్రించి, ప్రచారం చేశాయి. ఏప్రిల్ 17న ధర్నా కార్యక్రమం నిర్వహించాయి.*

– సంపాదకుడు

**అనంతపురం, 17–4–17 :**

**రాష్ట్రంలో** అత్యంత ఘోరంగా వరుసగా కరవు పరిస్థితులను ఎదుర్కొంటూ, గత్యంతరంలేని పరిస్థితుల్లో బ్రతుకుదెరువుకోసం ప్రజలు గ్రామాలకు గ్రామాలనే ఖాళీచేసి వెళ్తున్న అనంతపురంజిల్లాలో తక్షణ కరవు సహాయాన్ని, శాశ్వత కరవు నివారణ చర్యలను డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం రాష్ట్ర పిలుపుమేరకు జిల్లా కలెక్టరు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కా॥ బి.తిమ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఏఐఎఫ్‌టియు–న్యూ రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న మాట్లాడుతూ మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) బృందంతో జిల్లాలోని కొన్ని కరవు పీడిత ప్రాంతాలను పరిశీలించిన అనుభవాలను వివరించారు. జిల్లాలోని 63 మండలాలనూ కరవు పీడిత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, సహాయక చర్యలు మాత్రం చేపట్టక పోవటాన్ని తీవ్రంగా విమర్శించారు. మానవహక్కుల వేదిక నాయకులు ఎస్.ఎమ్.బాషా మాట్లాడుతూ జిల్లాలో భూగర్భజలాలు పడిపోయి, సాగునీరులేక పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయని ప్రభుత్వ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాయలసీమ కరవు నివారణ కోసం తక్షణం తాగునీటికోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ ధర్నాలో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు డా॥ బి. సూర్యసాగర్, ఏఐఎఫ్‌టియు–న్యూ జిల్లా నాయకులు కా॥ పి. రహంతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు, 17–4–17 :**

నెల్లూరుజిల్లాలో ఈ సంవత్సరం సాధారణంకంటే 64.4 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. తాగు, సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. వేలాది ఎకరాలలో పంటలు ఎండిపోయాయి. నిమ్మ,

బత్తాయి తోటలు నిలువునా మాడిపోయాయి. పశువులకు మేతకరవై వలసతోలు కెళ్ళటమో, కబేళాలకు తెగనమ్మటమో జరుగుతోంది.

ఈ పరిస్థితులను వివరిస్తూ జిల్లా కార్యవర్గంనుండి సవివరమైన కరపత్రం తీసుకువచ్చి డిమాండ్లు రూపొందించి, వెంకటగిరి, దక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, రాపూరు, నెల్లూరు రూరల్, కావలి, కొండాపురం ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఏప్రిల్ 17న నెల్లూరులో ప్రదర్శన నిర్వహించి, అనంతరం కలెక్టరు కార్యాలయంవద్ద ధర్నాచేశారు.

రైతుకూలీసంఘం జిల్లాకార్యదర్శి కా॥జి.సునీత ఈ ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ గత సంవత్సరం భారీవర్షాలకు పంటలు కొట్టుకుపోయినా, ఈ సం॥ కరవుతో పంటలు పండకపోయినా ప్రభుత్వం రైతులను ఆదుకున్నది లేదన్నారు.

రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ వి.వి. రమణయ్య మాట్లాడుతూ అధికార రాజకీయ నాయకుల జేబులునింపే పథకాలకు నిధులు పుష్కలంగా వెచ్చిస్తూ, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి మాత్రం ప్రభుత్వం సిద్ధంకావటం లేదన్నారు.

ధర్నాకు సంఘీభావంగా నవయువసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కా॥ఎల్.లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి నుండి ఉదయగిరి దాకా ప్రజానీకం కరువుబారినపడి పెద్దఎత్తున వలసలు పోతున్నా, ఉపాధి చూపించి వారిని నిలువరించే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరుకు అందజేశారు. వందమంది రైతు, కూలీలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా జిల్లా సంఘం నాయకులు కామ్రేడ్స్ ఆర్.సుబ్బరాయుడు, జి.కృష్ణారెడ్డి, జి.తిరుపాలు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**ఒంగోలు, 17-4-17 :**

ప్రకాశంజిల్లాలో కరవు, దుర్భిక్ష పరిస్థితులకు తోడు ప్రధానంగా నాగులుప్పలపాడు, ఇంకొల్లు, పర్చూరు, ముండ్లమూరు, జె.పంగులూరు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాల్లో, కందుకూరు డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రధానంగా మిర్చిపంటను సాగుచేస్తున్న రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలతో వివరమైన కరపత్రం తీసుకువచ్చి రైతాంగం నడుమ ప్రచారం చేశారు. రైతుల పంటలకు న్యాయమైన ధరలు కల్పించాలని, కరవు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్‌చేస్తూ 17-4-17న రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

సిపిఐ(ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥డివిఎన్ స్వామి ధర్నాను ప్రారంభిస్తూ పాలకుల విధానాల ఫలితంగా జిల్లా కరవు కోరల్లో చిక్కుకుందన్నారు. పాలకులు, తమకు కమీషన్‌లు, పర్సెంటేజీలు కల్పించే ఆదాయవనరుగా పెండింగ్ ప్రాజెక్టులను భావిస్తున్నారని, వారి మెడలు వంచేందుకు సంఘటిత ఆందోళనకు రైతు, కూలీలు సిద్ధంకావాలన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥లలితకుమారి మాట్లాడుతూ పశుగ్రాసం కొరతతో పాడిపశువుల్ని కబేళాలకు తరలించే దుస్థితి నెలకొందని, రైతులకు ఎంతోకొంత కుటుంబ ఆదాయానికి తోడ్పడే వనరు దెబ్బతిన్నాయన్నారు.

ఏఐఎఫ్‌టియు-న్యూ రాష్ట్ర నాయకులు కా॥ఎం.ఎస్.శాయి ధర్నాకు సంఘీభావంగా పాల్గొని మాట్లాడుతూ పట్టణాలకు వలసవచ్చిన వారు మురికి వాడలలో దుర్భరస్థితిలో జీవనం సాగిస్తున్నారని, వ్యవసాయరంగాన్ని కాపాడి, వలసలను అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇంకా ఈ ధర్నాలో ఓపిడిఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు కా॥కత్తి పేరయ్య, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కా॥శాంతకుమారి; సంఘం జిల్లా అధ్యక్షులు కా॥వేజెండ్ల రామారావు, జిల్లా నాయకులు కా॥ పరిటాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ధర్నాలో ప్రజాకళాకారులు రైతాంగ సమస్యలపై పాటలు పాడారు.

**గుంటూరు, 17-4-17 :**

గుంటూరుజిల్లాలో ప్రధానంగా పల్నాడు ప్రాంతంలో మిర్చి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను, పంట ఖర్చులు - దిగుబడి - అమ్మకపు ధరలను వివరిస్తూ, మిర్చి రైతులు నష్టాల, కష్టాల ఊబిలో కూరుకు పోతుండటాన్ని కరపత్రంగా ముద్రించి ప్రచారం చేశారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రపిలుపు మేరకు ఏప్రిల్ 17న గ్రీవెన్స్‌డే జరుగుతున్న జిల్లాపరిషత్ కార్యాలయంవద్ద రైతులు, కూలీలు ధర్నా నిర్వహించారు. తొలుత రైల్వేస్టేషన్‌నుండి ధర్నా శిబిరంవరకు ప్రదర్శన నిర్వహించారు.

ఈ ధర్నాలో సంఘం రాష్ట్రఅధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సీ పాల్గొని ప్రసంగిస్తూ శ్రమకోర్చి, అప్పులపాలై పంటలు పండించిన రైతులు, మార్కెట్ మాయాజాలంతో కుదేలైపోతున్నారన్నారు. ఇంటికి పెద్దకొడుకుగా అండగా వుంటానని చెప్పిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో మూల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవటంలేదన్నారు. భూసేకరణ చట్టానికి సవరణలు చేసే బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం పొందటం, యధేచ్ఛగా రైతుల భూముల గుంజివేతకు అవకాశం కల్పించటమేనన్నారు. కరవు కోరల్లో చిక్కుకున్న ప్రజలు భారీగా వలసపోతున్నా పాలకులకు పట్టటం లేదన్నారు. 'రాజధాని' జపంతో చంద్రబాబు ప్రజలను మభ్యపెడ్తున్నాడని చెప్తూ ప్రభుత్వాల రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ధర్నాకు అధ్యక్షత వహించిన సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ యస్. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 20 క్వింటాళ్ళ పరిమితితో, మిర్చి కొనుగోలుపై ప్రతి క్వింటాకు 1500 రూ. పరిహారం అందిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన ఎందుకూ కొరగానిదన్నారు. కౌలు రైతులు, సాధారణ రైతులు, ఇప్పటికే పంటను తెగనమ్ముకోవల్సి వచ్చిందని, వారికి ఇది ఏవిధంగానూ ఉపయోగపడదన్నారు.

సంఘం జిల్లా కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల పంటలన్నింటికీ న్యాయమైన ధరకల్పించి, ధరల స్థిరీకరణకు నిధిని ఏర్పరచి, ప్రభుత్వమే రైతులనుండి పంటను కొనుగోలు చేయాలని, ఇదే అదనుగా కొందరు కోల్డుస్టోరేజి యజమానులు సాగిస్తున్న దోపిడీని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

ఈ ధర్నాలో ఇంకా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కామ్రేడ్స్ నీలాద్రి రాంబాబు, దానబోయిన భాస్కర్, పి.సత్తయ్య, జె.పద్మ; ఏఐఎఫ్‌టియు-న్యూ నాయకులు కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**మచిలీపట్నం, 17-4-17 :**

కృష్ణాజిల్లా తీరప్రాంత మండలాల్లో, పశ్చిమకృష్ణా ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన కరవు పరిస్థితులను, జిల్లాలో ఉపాధి అవకాశాలు మృగ్యమవుతున్న తీరు, వలసల సమస్య, పోర్టు, ముడపేరుతో భూసేకరణలు, రైతాంగ పంటలకు న్యాయమైన ధరలు లభించని స్థితిగతులను వివరిస్తూ కరపత్రం ముద్రించి ప్రచారం చేశారు. ఏప్రిల్ 17న జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రసహాయ కార్యదర్శి కా॥ వై. సోనీ ధర్నాను ప్రారంభిస్తూ జిల్లాలోని 11 తీరప్రాంత మండలాల్లో 1,07,853 ఎకరాలు సాగునీటి సమస్యతో బీడుపడ్డాయన్నారు. సాగుచేసిన 64,766 ఎకరాలలో పంట ఎండిపోయిందన్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యతనీయకుండా విద్యుదుత్పత్తి చేయటమే సాగునీటి ఎద్దడికి కారణమన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించి వలసలు అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సంఘం జిల్లా కార్యదర్శి కా॥ వీరబాబు మాట్లాడుతూ కరవు పీడిత గ్రామాలనుండి వలసలు వెళ్ళటం, 'మెరుగైన జీవనం కోసమ'ని పాలకులు అపహాస్యం చేస్తున్నారన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ఎం.రాంబాబు మాట్లాడుతూ అత్యంత తీవ్రంగానున్న అనంతపురంజిల్లా కరవు సమస్యను పరిష్కరించాలని, తాగునీటిని తక్షణం అన్నిగ్రామాలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో బందరు, చిన్నాపురం, చల్లపల్లి, నాగాయలంక, కంకిపాడు, నందిగామ ప్రాంతాలనుండి రైతులు వ్యవసాయకూలీలు 120 మంది పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టరుకు మెమోరాండం ఇచ్చారు. ఈ ధర్నాలో ఇంకా సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ కొప్పినేని ఉమామహేశ్వరరావు, ఈపూరి రాంబాబు, తలశిల లీలామనోహర్ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ఏఐఎఫ్‌టియు-న్యూ నాయకులు ఎమ్.సుధాకరరావు, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ పామర్తి అంజమ్మ సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు. కా॥దుర్గాప్రసాద్ తదితర ప్రజాకళాకారులు రైతాంగ సమస్యలపై శిబిరంలో పాటలు పాడారు.

**పోలవరం, 18-4-17 :**

పశ్చిమగోదావరిజిల్లాలో కరవు, తీవ్రదుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వరుస కరువులతో రైతులు, వ్యవసాయకూలీలు తీవ్రంగా నష్టపోయారు. అన్నపూర్ణగా ఖ్యాతి వహించిన గోదావరి జిల్లాల నుండి కూడా బ్రతుకుతెరువు కోసం వలసలు పోవల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర పిలుపుమేరకు సంఘం అనుబంధ 'ఏజన్సీ గిరిజన సంఘం' ఆధ్వర్యంలో 18-4-17న పోలవరం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు.

ఏజన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కా॥ కుంజం రామారావు ధర్నాలో మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో సాగు, తాగునీటికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, చెరువులు పూడికతీసి వ్యవసాయానికి సాగునీరు అందించాలని, ఏజన్సీ గ్రామాలన్నింటిలో తక్షణ కరవు సహాయకచర్యలు చేపట్టాలని, చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని, ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో 150 మంది రైతులు, కూలీలు, గిరిజనులు పాల్గొన్నారు. ముందుగా కడెమ్మ కాల్వనుండి పోలవరం వీధులగుండా ప్రదర్శన నిర్వహించారు. ధర్నా అనంతరం తహసిల్‌దారుకు విజ్ఞాపనపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఇంకా, సంఘం నాయకులు సవలం రాంబాబు, పరమేశ్వరరావు; ఎన్‌వైయస్ నాయకులు మిడియం రవిదొర తదితరులు పాల్గొన్నారు.

**పార్వతీపురం, 17-4-17 :**

విజయనగరంజిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేయాలని, గ్రామీణ పేదల వలసలు అరికట్టాలని, తక్షణమే తాగునీరు గ్రామాలన్నింటికీ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఏప్రిల్ 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ ఊయక ముత్యాలు మాట్లాడుతూ జిల్లాలో జంఝావతి, నాగావళి, సువర్ణముఖి, వేగావతి, చంపావతి, గోస్తనీలాంటి జీవనదులేకాకుండా ఏజన్సీ ప్రాంతంలో వనకాబడిగెడ్డ, కనుసులగుమ్మగెడ్డ, పాశర్లగెడ్డ, అడారుగెడ్డ లాంటి జీవగడ్డలున్నప్పటికీ జిల్లాలో వ్యవసాయం పూర్తిగా వర్షాధారంపై ఆధారపడాల్సి రావటానికి పాలకుల విధానాలే కారణమన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా సహాయకార్యదర్శి కా॥శ్రీనునాయుడు మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటి తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని, కలుషిత జలాలతో గిరిజనులు అనేక వ్యాధులబారిన పడుతున్నారన్నారు. ధర్నా అనంతరం

జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఇంకా సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ బొత్స నర్సింగరావు, కద్రక వెంకటస్వామి, ఎమ్.భాస్కరరావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**శ్రీకాకుళం, 17-4-17 :**

కరవు, ఉపాధిలేమి, పెరుగుతున్న వలసలు, సాగు - తాగునీటి సమస్యలతో అల్లాడుతున్న గ్రామీణ ప్రాంతాలలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రపిలుపుమేరకు, శ్రీకాకుళంజిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

జిల్లాలో వంశధార, నాగావళి, మహేంద్ర తనయ, బాహుదా వంటి జీవనదులు; పదుల సంఖ్యలో జీవగెడ్డలు వున్నప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించని ప్రభుత్వాల విధానాల ఫలితంగా ప్రతి సం॥రం కరవు తీవ్రత పెరుగుతున్నదని సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥డి.వర్మ ఈ ధర్నా సందర్భంగా పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11 మండలాలను మాత్రమే ప్రభుత్వం కరవు పీడిత మండలాలుగా ప్రకటించిందని, వాస్తవానికి ఈ సంఖ్య మరింత హెచ్చుగా వుందని ఆయన అన్నారు.

సంఘం జిల్లాకార్యదర్శి కా॥టి.అరుణ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని, పండిన పంటలకు మద్దతుధరలు కల్పించాలని, వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పాలని, కరవు, వలసల తక్షణ సహాయ, శాశ్వత నివారణ చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, అందుకు రైతు, కూలీలు, గ్రామీణ పేదలు సమైక్యంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 200మంది రైతు, కూలీలు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టరుకు మెమోరాండం అందజేశారు. ఈ ధర్నాలో ఇంకా సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ పి. పోలారావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

ooooo